



ప్రజా **రిపబ్లిక్**
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM


సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 181 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- | బుధవారం 05 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# కుంభమేళాకు మోదీ.. త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం

ప్రధాని నరేంద్రమోదీ మహా కుంభమేళాను సందర్శించి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు.

**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. కొద్దిసేపటి క్రితం ఈ వేడుక జరుగుతోన్న ప్రయాగ్‌రాజ్ చేరుకున్న ఆయన రుద్రాక్షలు చేతబూని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత గంగానదికి హారతి ఇచ్చి, పూజలు నిర్వహించారు. తొలుత ప్రయాగ్ రాజ్ విమానాశ్రయంలో దిగిన ప్రధాని మోదీ అక్కడినుంచి అరైల్ ఘాట్‌కు వెళ్లారు.



ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరించారు. దానికి ముందు అక్కడి బోటులో ప్రయాణించారు. స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులకు బోటు నుంచే అభివాదం చేశారు. అప్పుడు ఆయన వెంట యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు. 144 ఏళ్లకోసారి వచ్చే ఈ మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా.. భారత్‌తోపాటు విదేశాల నుంచి భారీసంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఫిబ్రవరి 26 వరకు ఈ వేడుక జరగనుంది. ఇప్పటివరకు పలువురు రాజకీయ, సినీ, వ్యాపారరంగాలతో పాటు పలువురు ప్రముఖులు, సామాన్య పౌరులతో కలిపి 38 కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించారు. ఈరోజు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పుణ్యస్నానమాచరించారు. ఈ చరిత్రాత్మక సమయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తోన్న తరుణంలో ప్రతిఒక్కరూ మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ ప్రయాగ్ రాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500 కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

### అప్పుల్లో మునిగిన ఏపీకి కేంద్రం ఆక్సిజన్..
# రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీలో లోకేశ్

ఏపీ మంత్రి నారా లోకేశ్ రెండో రోజు ఢిల్లీలో పర్యటించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.




**ఢిల్లీ, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ మంత్రి నారా లోకేశ్ రెండో రోజు ఢిల్లీ పర్యటన కొనసాగింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. లోకేశ్‌తో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను రాజ్నాథ్ సింగ్కు లోకేశ్ వివరించారు. ఏపీలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. రక్షణ రంగ పరికరాల యూనిట్లు రాష్ట్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఏపీని తిరిగి అభివృద్ధి పట్టాలు ఎక్కిస్తున్నట్లు వివరించారు. అమరావతి, పోలవరం పనులు సాగుతున్న తీరును లోకేశ్ వివరించారు. అప్పుల్లో మునిగిన ఏపీకి కేంద్రం ఆక్సిజన్ అందిస్తోందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఏపీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తామని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు.

### ఢిల్లీలో కొనసాగుతోన్న పోలింగ్..
# ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు ఓటు వేశారు.

**ఢిల్లీ, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవ్వగా.. తొలి గంటల్లోనే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు జరగనున్న ఓటింగ్లో 1.56 కోట్ల మందికి పైగా ఢిల్లీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరుగుతోంది. అన్ని స్థానాల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, భాజపా, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఓటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 30వేల మంది పోలీసులు, 220 కంపెనీల పారామిలిటరీ బలగాలను మోహరించారు.



**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు వీరే..**

- దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి ఎస్టేట్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధనఖడ్ తన సతీమణి సుదేశ్తో కలిసి నార్త్ అవెన్యూలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.
- కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిర్మాణ్ భవన్లో ఓటు వేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ కుటుంబసభ్యులు కూడా ఇదే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆయన సతీమణి సునీత, ఇతర కుటుంబసభ్యులు న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు వేశారు.
- విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, ఆయన సతీమణి తుగ్లక్ క్రెసెంట్లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఆయన సతీమణి లక్ష్మి పురి, ఇతర కుటుంబసభ్యులు ఆనంద్ నికేతన్లో ఓటు వేశారు.
- దివంగత నేత సుష్మాస్వరాజ్ కుమార్తె, భాజపా ఎంపీ బన్సూరీ స్వరాజ్ జన్పథ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠీ కె. క్రమాజ్ లేన్లో ఓటు వేశారు.
- ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా, తన సతీమణి సీమాతో కలిసి న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఢిల్లీ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా రాజ్ నివాస్ మార్గ్, ముఖ్యమంత్రి ఆతిశీ కాల్కాజీలో ఓటు వేశారు.

# క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా.. ప్రకటించిన సీఎం

ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆమెకు రూ.కోటి నజరానా ప్రకటించారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని భారత మహిళా క్రికెటర్ గొంగడి త్రిష మర్యాదపూర్వకంగా కలిశారు. ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆమెకు రూ. కోటి నజరానా ప్రకటించారు. అండర్ 19 ప్రపంచకప్ టీమ్లో మరో సభ్యురాలు ధ్రుతి కేసరి, టీమ్ హెడ్కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు. త్రిషను సత్కరించిన సీఎం.. భవిష్యత్తులో దేశం తరపున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభం నుంచి ఆల్రౌండ్ ప్రదర్శనతో త్రిష అదరగొట్టింది. టీమ్ ఇండియా కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.



# జగన్ పాలనతో ఏపీ 20 ఏళ్లు వెనక్కి :మంత్రి నిమ్మల రామానాయుడు

జగన్ పాలనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.



**నిడదవోలు, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** జగన్ పాలనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. అపఖ్యాతిలో అంతర్జాతీయ సాయికి ఎదిగిన ఆయన్ను చూసి పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతలతో మంత్రులు నిమ్మల, కందుల దుర్గేశ్ సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో నిమ్మల మాట్లాడారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు కూటమి నేతలు సమష్టిగా కృషి చేయాలన్నారు. "జగన్ మళ్లీ అధికారంలోకి రారనే భరోసా కల్పిస్తేనే పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తామని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో చెత్త సీఎం అంటే ఆయనే. జగన్ పెండింగ్లో పెట్టిన రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టడంతో పాటు నిర్వాసితులను రూ.1000 కోట్ల పరిహారం అందించాం. రైతులకు జగన్ ఎగ్గొట్టిన రూ.1640 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది" అని రామానాయుడు అన్నారు.

### వివేకా హత్య కేసు..
# దస్తగిరి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు

వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు.



**పులివెందుల, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు. 2023లో దస్తగిరిని ఇబ్బంది పెట్టిన నలుగురిపై పులివెందుల పోలీసులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. కేసు నమోదైన వారిలో వివేకా హత్య కేసు నిందితుడు శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి, గతంలో జమ్మలమడుగు డీఎస్పీగా పనిచేసిన నాగరాజు, ఎర్రగుంట్ల సీఐగా పనిచేసిన ఈశ్వరయ్య, కడప జైలు సూపరింటెండెంట్గా పనిచేసిన ప్రకాశ్ ఉన్నారు. 2023 అక్టోబర్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు కడప జైలులో దస్తగిరి రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈక్రమంలో వివేకా కేసులో వైకాపా నేతలకు మద్దతుగా మాట్లాడాలని డీఎస్పీ నాగరాజు, సీఐ ఈశ్వరయ్య బెదిరించినట్లు దస్తగిరి ఫిర్యాదు చేశారు. మరోవైపు 2023 నవంబరులో కడప జైలుకు వచ్చి సీబీఐ ఎస్పీ రామ్ సింగ్కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరించినట్లు దస్తగిరి ఫిర్యాదు చేశారు. రామ్ సింగ్కు వ్యతిరేకంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తానని చెప్పినట్లు అందులో పేర్కొన్నారు. వీరితో పాటు జైలులో సూపరింటెండెంట్ ప్రకాశ్ తనను ఇబ్బంది పెట్టారని దస్తగిరి ఫిర్యాదులో వివరించారు.

### ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు..
# మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ శాతం ఇలా..

ఢిల్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు.

**ఢిల్లీ, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో శాసనసభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, ఢిల్లీ సీఎం ఆతిశీ, కేంద్ర మంత్రి జై శంకర్ సహా పలువురు ప్రముఖులు తొలి గంటల్లోనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగా.. మధ్యాహ్నం 3 గంటల వరకు 46.55 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలతో పాటు తమిళనాడులోని ఈరోడ్(ఈస్ట్), ఉత్తరప్రదేశ్లోని మిల్కిపుర్లో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో 53.63 శాతం, 57.13 శాతం పోలింగ్ నమోదైంది. ఈరోడ్ ఈస్ట్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతి చెందడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయోధ్య జిల్లాలోని మిల్కిపుర్లో ఉప ఎన్నికను సమాజ్వాదీ పార్టీ, భాజపా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరి భవితవ్యాన్ని తేల్చేందుకు మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 13,766 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు ఓట్లు వేస్తున్నారు. హోమ్ ఓటింగ్ సౌకర్యం ద్వారా అర్హత కలిగిన



7,553 మంది ఓటర్లలో 6,980 మంది ఇప్పటికే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈనెల 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు.

# మండుతున్న ఎండలు.. తెలంగాణలో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు

తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరిలోనే వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి.

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఫిబ్రవరిలోనే వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో తేమ శాతం తగ్గడంతో ఎండలు పెరిగాయని.. 32 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపింది. హైదరాబాద్, నిజామాబాద్, హనుమకొండ, మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించింది. మరో వారం రోజులపాటు ఈ ఉష్ణోగ్రతలు ఇలాగే కొనసాగుతాయని.. ఆ తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.



# తితిదే కీలక నిర్ణయం.. హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు

హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) చర్యలకు ఉపక్రమించింది.

**తిరుమల, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో ఉన్నప్పుడు హిందూయేతర మత ఆచారాలు పాటించిన వారిపై చర్యలకు తితిదే సిద్ధమైంది. 18 మందిపై క్రమశిక్షణ చర్యలకు తితిదే ఆదేశాలు జారీ చేసింది. హిందూయేతర ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. వీఆర్ఎస్ తీసుకునే వారికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచనలతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గతేడాది నవంబరు 18న తితిదే బోర్డు సమావేశంలో చేసిన తీర్మానం మేరకు చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



### ఎస్సీ వర్గీకరణ..
# లోపాలు సరిదిద్దాలి: మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, (రిపబ్లిక్ న్యూస్):** ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. చాలా కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని.. మాదిగల జనాభాకు తగ్గట్లుగానే రిజర్వేషన్ల వాటా ఉండాలని విన్నవించామని చెప్పారు.



హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నివేదికలో 9శాతం రిజర్వేషన్లే దక్కుతున్నాయన్నారు. "15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. 32 లక్షలు ఉన్న మాదిగలకు ఏ ప్రాతిపదికన తీసుకున్నా 11 శాతం రావాలి. ప్రభుత్వం ప్రతిపాదించిన రిజర్వేషన్ల పంపిణీలో లోపాలను సరిదిద్దాలి. మాకు రావాల్సిన దానికంటే 2 శాతం తక్కువ ఉన్నాయి" అని మందకృష్ణ మాదిగ అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# నెట్‌ప్లిక్స్‌లో 'పుష్ప 2' హవా.. ఏడు దేశాల్లో టాప్

**అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'పుష్ప 2' నెట్‌ఫ్లిక్స్‌లో హవా కొనసాగిస్తోంది. భారీ వ్యూస్తో రికార్డులు నెలకొల్పుతోంది.**



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప2: ది రూల్. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న విడుదలైన ఈ సినిమా థియేటర్ లో రికార్డులు నెలకొల్పి చరిత్ర సృష్టించింది. భారీ విజయాన్ని అందుకున్న 'పుష్ప 2' జనవరి 30న నెటిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లోనూ రికార్డు సృష్టించింది. ఓటీటీలోకి వచ్చిన నాటినుంచి వ్యూస్ పరంగా టాప్లో ఉన్న 'పుష్ప 2' తాజాగా ఏడు దేశాల్లో నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లేతర సినిమాల విభాగంలో 5.8 మిలియన్ల వ్యూస్తో నెట్‌ఫ్లిక్స్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఇది తెలుగు సినిమాకు దక్కిన అరుదైన ఘనత అని అభిమానులు అంటున్నారు. ఈ వీక్షణల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కామెంట్స్ చేస్తున్నారు. మొదట 3 గంటల 20 నిమిషాల నిడివితో విడుదలైన 'పుష్ప 2'కు అదనంగా ఇటీవల మరో 20 నిమిషాల సన్నివేశాలను జత చేశారు. దీంతో సినిమా నిడివి దాదాపు 3 గంటల 40 నిమిషాలు అయింది. ఇక ఓటీటీ వెర్షన్ కూడా ఇదే నిడివితో అందుబాటులో ఉంది.

### ఎంతో సంతోషంగా ఉంది: అల్లు శిరీష్



'పుష్ప 2' ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇంటర్నేషనల్ ఆడియన్స్ ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రత్యేకించి జాతర ఎపిసోడ్కు వారంతా ఫిదా అవుతున్నారు. ఎక్స్ వేదికగా ఆ సీన్స్‌ను షేర్ చేస్తూ చిత్రబృందాన్ని అభినందిస్తున్నారు. తన సోదరుడి సినిమాకు ఈ స్థాయిలో ప్రశంసలు రావడం ఎంతో సంతోషంగా ఉందని అల్లు శిరీష్ పోస్ట్ పెట్టారు. "పుష్ప2: ది రూల్ ఇంటర్నేషనల్ ఆడియన్స్ నుంచి విశేషమైన ఆదరణ అందుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. ఇలాంటి చిత్రాలు వారి సంస్కృతికి భిన్నమైనప్పటికీ దాన్ని వాళ్లు ఆదరిస్తున్న తీరు ఆశ్చర్యంగా ఉంది" అంటూ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# హీరోయిన్లకు కూడా దొరకని అవకాశం నాకు వచ్చింది :విక్కీ కౌశల్

**షారుక్ ఖాన్ తో కలిసి నటించిన 'డంకీ'ను విక్కీకౌశల్ గుర్తుచేసుకున్నారు. ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం తన అదృష్టమన్నారు.**



రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం 'డంకీ'. ఈ సినిమాలో సుఖి అనే పాత్రలో విక్కీ కౌశల్ నటించి అందరినీ మెప్పించారు. ఈ చిత్రంలో వచ్చే ఇంటిమేట్ సన్నివేశం గురించి ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. హీరోయిన్స్కు కూడా రాని అవకాశం తనకు వచ్చిందంటూ ఫన్నీ కామెంట్స్ చేశారు. "డంకీ' చిత్రంతో నా కలలు చాలా నెరవేరాయి. నేను మద్యం తాగి నటించే సన్నివేశం ఉంటుంది. ఆ తర్వాత సీన్లోనే నేను షారుక్ చేతుల్లో చనిపోతాను. ఆ అదృష్టం హీరోయిన్లకు కూడా దక్కలేదు. ఆయనతో అలాంటి గొప్ప సన్నివేశంలో నటించినందుకు ఆనందంగా ఉంది. 'మీరు నాతో ఉన్నంత సన్నిహితంగా ఎవరితోనైనా ఉంటారా' అని షారుక్ను అడిగాను. ఆయన 'నో' అని నవ్వుతూ చెప్పారు. షారుక్ ఓ లెజెండ్. ఎన్నో కోట్లమంది ఆయన్ని అభిమానిస్తున్నారు. ఆయనలాంటి హీరోను ఎక్కడా చూడలేదు" అని అన్నారు. ఇక విక్కీ ప్రస్తుతం 'ఛావా'తో బిజీగా ఉన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవితాధారంగా రూపొందుతున్న చిత్రమే 'ఛావా'. శంభాజీ మహరాజ్ విక్కీ కౌశల్, ఆయన భార్య పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల విడుదలైన పాటలు, వీడియోలు మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్నాయి.

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1915: ఆంధ్ర ప్రజా నాట్య మండలి వ్యవస్థాపకుడు గరికపాటి రాజారావు జననం (మ.1963).
- 1920: బుర్రకథ పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ జననం (మ.1997).
- 1936: కన్నడ భాషా రచయిత కె.ఎస్.నిసార్ అహ్మద్ జననం.
- 1961: రచయిత, ప్రజా ఉద్యమనేత వట్టికోట ఆళ్వారుస్వామి మరణం (జ.1915).
- 1976: భారతీయ సినిమా నటుడు అభిషేక్ బచ్చన్ జననం. (చిత్రంలో)
- 2008: ఆధ్యాత్మిక యోగి మహర్షి మహేష్ యోగి మరణం (జ.1918).



గరికపాటి రాజారావు



షేక్ నాజర్



కె.ఎస్.నిసార్ అహ్మద్



వట్టికోట ఆళ్వారు-స్వామి



అభిషేక్ బచ్చన్



మహర్షి మహేష్ యోగి

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం

# రిటైర్మెంట్ పై రోహిత్ నిర్ణయం?

**మొన్న టీ20లకు వీడ్కోలు పలికాడు. ఇటీవల టెస్టులకు అదే నిర్ణయం తీసుకొనేందుకు వెళ్లి యూటర్న్ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు వన్డేలకూ గుడ్బై చెప్పేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.**



మరో రెండు వారాల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. రోహిత్ శర్మ నాయకత్వంలో టీమ్ ఇండియా బరిలోకి దిగనుంది. గతేడాది టీ20 ప్రపంచకప్ తర్వాత పొట్టి ఫార్మాట్కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఆసీస్లో టెస్టు సిరీస్ సమయంలోనూ సంచలన నిర్ణయం తీసుకుంటాడని వార్తలు వచ్చాయి. అయినా టెస్టులకు గుడ్బై చెప్పలేదు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వీడ్కోలు నిర్ణయం తీసుకుంటాడని సమాచారం. మరోవైపు బీసీసీఐ కూడా భవిష్యత్తు సారథ్యంపై ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ 2025-27 సీజన్ తోపాటు వన్డే ప్రపంచ కప్ 2027 కోసం టీమ్ను సిద్ధం చేసేందుకు బీసీసీఐ సమాయత్తమవుతోంది. అందులో భాగంగా సీనియర్ల భవితవ్యంపై ఓ స్పష్టత కోరే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. రోహిత్తో పోలిస్తే విరాట్ కోహ్లి ఫిట్నెస్ బాగుంటుందని.. మరికొన్నేళ్లు జాతీయజట్టుకు ఆడే అవకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్కు రోహిత్ శర్మ వీడ్కోలు పలికితే అతడి స్థానంలో రెండు ఫార్మాట్లకు కెప్టెన్లను నియమించాల్సి ఉంటుంది. టెస్టులకు జస్ప్రీత్ బుమ్రా, రిషబ్ పంత్ రేసులో ఉండగా.. వన్డేలకు శుభ్మన్ గిల్, పంత్ ఉన్నట్లు తెలుస్తోంది. యశస్వి జైస్వాల్కు సుదీర్ఘ ఫార్మాట్ బాధ్యతలు అప్పగించాలనేవారూ లేకపోలేదు. "గత సెలక్షన్ కమిటీ సమావేశంలోనే రోహిత్తో సెలక్టర్లు, బీసీసీఐ బోర్డు సభ్యులు చర్చలు జరిపారు. కాస్త సమయం కావాలని రోహిత్ అప్పుడు చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవచ్చు. డబ్ల్యూటీసీ కొత్త సీజన్తోతోపాటు వన్డే ప్రపంచకప్ను దృష్టిలో ఉంచుకొని మేనేజ్మెంట్ ప్రణాళికలను సిద్ధం చేయనుంది. ప్రతిఒక్కరితో చర్చలు జరిపి భారత జట్టులో మార్పులు తీసుకురావాలనేది బోర్డు అభిమతం. సారథులుగా ఎవరిని నియమిస్తారనేది ఆసక్తికరంగా మారింది. బుమ్రా సారథ్యంపై ఎలాంటి ఇబ్బంది లేకపోయినా.. గాయాల బెడద అతడికి సానుకూలంగా ఉండకపోవచ్చు. అందుకే, నిలకడగా ఉండే ప్లేయర్ వైపు మేనేజ్మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. రిషబ్ పంత్ బలమైన అభ్యర్థి. అతడితోపాటు యశస్వి కూడా ఈ రేసులో ఉన్నాడు" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

# క్యాన్సర్ పై పోరు.. కన్నీళ్లు పెట్టుకున్న నటి

**హిందీ సీరియల్ నటి హీనా ఖాన్ కొంతకాలంగా క్యాన్సర్తో పోరాటం చేస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమె తన ప్రయాణం గురించి తలచుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు.**

'యే రిష్తా క్యా కెల్లాతా హై' అనే హిందీ సీరియల్తో గుర్తింపు తెచ్చుకున్నారు బాలీవుడ్ నటి హీనా ఖాన్. తాను రొమ్ము క్యాన్సర్ తో పోరాటం చేస్తున్నానని గతేడాది ప్రకటించారామె. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాజాగా ఆమె ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్యాన్సర్పై తన పోరు గురించి వెల్లడించారు. ఈక్రమంలోనే భావోద్వేగానికి గురయ్యారు. క్యాన్సర్ విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని.. సమయానుగుణంగా పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని సూచించారు. "టెస్ట్ రిపోర్టులో క్యాన్సర్కు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లు వచ్చినప్పుడు ఎంతో బాధగా ఉంటుందో మాటల్లో వర్ణించలేం. అది ఎంత భారంగా ఉంటుందో మమ్మల్ని అడగండి మేము చెబుతాం" అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. తనని తాను తామాయించుకుని స్పీచ్ కొనసాగించారు. "ఆ రిపోర్టులు చదవడం క్లిష్టంగా ఉంటుంది. వైద్యులను సంప్రదించడం.. క్యాన్సర్ ఉందని అర్థం చేసుకోవడం.. దానిపై పోరాటం. క్యాన్సర్ ఉందని తెలిసిన రెండు, మూడు రోజుల్లోనే చికిత్స చేయించుకోవడం ప్రారంభించా. చికిత్స విషయంలో ఆలస్యం చేయకూడదు. ఈ ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు పడ్డా. ఎంతో బాధను దిగమింగాను. కాబట్టి, సమయానుగుణంగా కాస్త డబ్బులు



వెచ్చించి క్యాన్సర్కు సంబంధించిన టెస్టులు చేయించుకోవడం మంచిది. డబ్బు వృథాగా ఖర్చు పెట్టామని ఎప్పుడూ అనుకోవద్దు" అని ఆమె తెలిపారు. తన ప్రయాణంలో సాయం చేసిన వారందరికీ ఆమె ధన్యవాదాలు చెప్పారు. కుటుంబసభ్యులు, స్నేహితులు తనకు సపోర్ట్ నిలిచారని అన్నారు. స్టేజ్ 3 బ్రెస్ట్ క్యాన్సర్తో తాను బాధపడుతున్నట్లు గతేడాది జూన్లో ప్రకటించారు నటి హీనాఖాన్. ఈక్రమంలోనే ఆమె వర్క్ లైఫ్ నుంచి బ్రేక్ తీసుకున్నారు. "నాకు వేరే అవకాశం లేదు. అప్పటివరకూ నేను చేస్తోన్న ప్రాజెక్టు నుంచి విరామం తీసుకోవాల్సిన సమయం అది. తరచూ మనం స్క్రీన్పై కనిపించకపోతే ప్రేక్షకులు మనల్ని మర్చిపోతారు. ఈ పరిశ్రమలో ఉన్న కఠిన నిజమది. క్యాన్సర్ తో పోరాడుతున్న సయమంలో కెరీర్ కంటే ఆరోగ్యంపైనే ఎక్కువ ఫోకస్ పెట్టాలని అర్థమైంది" అని తెలిపారు. ఆ సమయంలో తాను ఎన్నో ప్రాజెక్టులు వదులుకోవాల్సి వచ్చిందన్నారు. ఆమె నటించిన 'గృహలక్ష్మి' ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చింది.

## ఇంటి చిట్కాలు

# వంట చేసేందుకు టైమ్ లేదని కంగారుపడుతున్నారా, ముందురోజే కొన్ని పనులు చేస్తే 10 నిమిషాల్లోపే హ్యాపీగా వండుకోవచ్చు, అవేంటంటే

ప్రజెంట్ ప్రతి ఒక్కరూ బిజీనే. చాలా వరకూ అందరూ జాబ్ చేయడంతో క్షణం కూడా తీరిక లేని పరిస్థితి. ఇంటిపనులు చేయడం కష్టంగా మారింది. మరీ ముఖ్యంగా, వంట చేయడానికి టైమ్ లేక బయట ఏదో ఓ ఫుడ్ తింటున్నారు. కానీ, అలా కాకుండా ఇంట్లోనే హెల్దీ అండ్ ఫాస్ట్‌గా ఎలా వండుకోవాలో తెలుసుకోండి.

ముందుకాలంతో పోలిస్తే ప్రజెంట్ ఉద్యోగాలు చేసేవారి సంఖ్య పెరిగిపోయింది. దీంతో బిజీబిజీగా ఉంటున్నారు. ఫుడ్ కూడా టైమ్‌కి తినలేకపోతున్నారు. ఒకవేళ తినాలనుకున్నా వండే ఓపిక, టైమ్ ఉండదు. ఇక ఆ టైమ్‌కి ఆకలితో బయటి ఫుడ్స్ తినడం, ఫాస్ట్ ఫుడ్, జంక్‌ఫుడ్‌కి అలవాటు పడిపోతున్నారు. కానీ, వీటి వల్ల చాలా సమస్యలొస్తాయి. ఆరోగ్యం పాడవుతుంది. అలా కాకుండా ఇంట్లోనే వండాలంటే సమయమా.. అసలే ఉండదే అనుకునే బిజీ పీపుల్ కోసం ఈజీగా ఇంట్లోనే వంట చేసుకునేందుకు కొన్ని చిట్కాలు ఉన్నాయండి. వీటిని ఫాలో అయితే, ఇంట్లోనే హెల్దీ ఫుడ్ మీరే వండుకుని హ్యాపీగా తినొచ్చు.ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.




### పర్ఫెక్ట్‌గా ఉండాలనుకోవద్దు



వంటలంటే చికెన్ దమ్ బిర్యానీ, దమ్ బగారా, మటన్, పనీర్ మసాలా వంటివే అనుకోకుండి సింపుల్‌గా అయిపోయే వంటల్ని ఎంచుకోండి. మిమ్మల్ని మీరు మరీ షెఫ్‌గా కాకుండా మామూలుగా చేసేందుకు ట్రై చేయండి.

### ముందుగానే అనుకోవడం



అదే విధంగా, వారంలో ఏ వంట చేయాలనేది ప్రతి రోజుకోసం మెనూని వారం ముందు లేదా వీకెండ్‌లో అనుకోండి. మనకి వంట చేయడం కంటే అసలు ఏం వండాలనేదాంతోనే చాలా టైమ్ వేస్ట్ అవుతుంది. అలా కాకుండా ముందుగానే అనుకుంటే ఈజీగా పని అయిపోతుంది. ఎలాంటి హడావిడి ఉండదు. ప్రోటీన్ ఎక్కువగా ఉండే మీట్, ఫ్రూట్స్, కూరగాయలు, హెల్దీ ఫ్యాట్స్ తీసుకోండి.

### రెండు బదులు



మరీ టైమ్ ఎక్కువగా లేనప్పుడు అన్నం, కూర అంటూ రెండు రెండు వండకుండా సాంబార్ రైస, పులిహోర, దద్ధ్యోజనం, పొంగల్, రసం రైస్ వంటివి తయారు చేసుకోవచ్చు. దీని వల్ల వంట త్వరగా పూర్తవుతుంది. కడుపు నిండుగా కూడా ఉంటుంది.

### ముందుగా కట్ చేసి పెట్టుకోవడం




మనం వంట చేయడానికి ముందు రోజు రాత్రి మరుసటి రోజుకి కావాల్సిన కూరగాయల్ని కడిగి విరిచి పెట్టుకోవడం, కట్ చేసుకోవడం చేయాలి. దీని వల్ల పని చాలా త్వరగా పూర్తవుతుంది.

### గ్యాడ్జెట్స్



వంటింట్లో కొన్ని వస్తువులు ఉంటే వంట పని చాలా ఈజీగా అవుతుంది. ప్రెజర్ కుక్కర్, ఎయిర్ ఫ్రైయర్, మైక్రోవేవ్ వంటివి ఉంటే మీ పని చాలా త్వరగా అవుతుంది. కాబట్టి, కొత్త కొత్త గ్యాడ్జెట్స్ మార్కెట్లో ఎన్నో ఉన్నాయి. వాటిని తెచ్చి పెట్టుకోండి. దీంతో అరగంటలో పూర్తయ్యే పని 15 నిమిషాల్లోనే అవుతుంది.

### ఎక్కువ హడావిడి లేకుండా



చాలా మంది వంట అనగానే ఎక్కువ హడావిడి చేస్తారు. ఎక్కువ పదార్థాలు తెచ్చుకుంటారు. ఏవేవో మసాలాలు కొన్ని కష్టమైన పనులు చేస్తుంటారు. అలా కాకుండా తక్కువ పదార్థాలతో హడావిడి లేకుండా చేసుకునే వంటల్ని ఎంచుకోండి. ఈజీగా పనులు అయిపోయేలా చూసుకోండి. సలాడ్స్, ర్యాప్స్, కోడిగుడ్డు వంటివి ట్రై చేయండి. ఇవన్నీ కూడా త్వరగా అయిపోతాయి. తక్కువ పదార్థాలే అవసరమవుతాయి. పైగా హెల్దీగా కూడా ఉంటాయి.